రైతుల పోస్టుకార్డు ఉద్యమం

చిన్నకోడూరు: రైతులు ప్రారంభించిన పోస్ట్‌కార్డు ఉద్యమానికి మద్దతు ప్రకటించిన జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటరూరల్: సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ద్వారా సమస్యలు విన్నవిస్తున్న రైతులు

- హామీలు అమలు చేయాలి
- మద్దతు ప్రకటించిన జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 15: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ సిద్దిపేట రైతులు పోస్టుకార్డు ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి వినతులు పంపారు. హామీలు అమలు చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రైతులు చేస్తున్న ఉద్యమానికి జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు కీసర పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఉమేశ్‌చంద్ర మద్దతు ప్రకటించారు.

హామీలు అమలు చేయాలి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్15: సీఎం రేవంత్‌రెడ్డి మాగోడు వినాలని రైతులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సిద్దిపేట నియోజకవర్గంలోని పత్తి మార్కెట్‌యార్డులో సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, చిన్నకోడూర్ మండలం పత్తి మార్కెట్‌లో రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా సమస్యలు ఎత్తిచూపారు.

నంగునూరులో..

నంగునూరు, ఏప్రిల్ 15: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మండలంలోని రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా ఉత్తరాలు రాశారు. మండల పరిధిలోని సిద్దన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు రూ.500 బోనస్ ఇచ్చి ఆదుకోవాలని, రైతు రుణమాఫీ రూ.2 లక్షలు చేయాలని, పెంచిన రైతుబంధు రూ.15,000 రైతుల ఖాతాల్లో జమచేయాలని ఉత్తరాల ద్వారా తెలియజేశారు. రైతులకు బీఆర్ఎస్ నంగునూరు మండల నాయకులు మద్దతు తెలిపారు.

నంగునూరు: సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ఉత్తరాలు రాస్తున్న రైతులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

హుస్నాబాద్, ఏప్రిల్ 15: హుస్నాబాద్ పట్టణంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సోమవారం సాయంత్రం పరామర్శించారు. పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన కమాల్‌సాబ్ కుమారుడు ఇటీవల మృతి చెందగా ఆయన్ను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన పూదరి నర్సయ్య గౌడ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎండీ అన్వర్, చిట్టి గోపాల్‌రెడ్డి, ఆకుల వెంకట్ ఉన్నారు.



కల్యాణోత్సవంలో డోలు వాయిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

బీరప్ప కామరాతి కల్యాణం

ములుగు, ఏప్రిల్ 15: మండలంలోని మామిడ్యాల్‌లో సోమవారం చండీశ్వర బీరప్ప కామరాతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో పరిసర ప్రాంత మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కత్తి కార్తీకపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

దుబ్బాకలో మాట్లాడుతున్న వనితాభూంరెడ్డి

సిద్దిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం నేతలు

దుబ్బాక, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీకపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, దుబ్బాక మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. కత్తి కార్తీకపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించిన వారు సోమవారం దుబ్బాకలో వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కత్తి కార్తీక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తే...ఆమెపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్ దేవుని లలిత, నాయకులు అనురాధ, యాదమ్మ, వీణ, లలిత, కౌన్సిలర్లు యాదగిరి, స్వామి, కనకయ్య, నాయకులు రామస్వామిగౌడ్, రాజాలింగంగౌడ్, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీకి బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీక, ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదని టీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు టైగర్ నరసమ్మ, పొన్నమల సువర్ణ లక్ష్మి మండిపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఒక మహిళ అయి ఉండి సాటి మహిళను వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు. బీఆర్ఎస్ నేతలు, నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మహిళా విభాగం నేతలు సునీత, నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొనాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 15 : వైద్య పరంగా నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొని సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు నిర్వహించాలన్నారు. మాతాశిశు మరణాలు జరుగకుండా చూడాలన్నారు. గర్భిణుల నమోదు దగ్గర నుంచి ప్రసవాలకు సంబంధించిన రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్లు వినోద్ బాబ్జి, శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయరాణి, రజిని, శ్రీదేవి, ఏపీ శ్రీనివాస్‌రెడ్డి, డీపీహెచ్ఎన్‌వో మేరీ, డెమో నవీన్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న ఏఈవో ప్రణీత

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని మహ్మదాపూర్, మడద, రాములపల్లి, నాగారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏఈవో ప్రణీత సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించుకోవాలన్నారు. తేమ 17శాతంలోపు ఉండితాలు లేకుండా ధాన్యం తీసుకువస్తే రైతులకు సరైన మద్దతు ధర లభిస్తుందన్నారు.

పాట్లపల్లి వాసికి కార్మిక రత్న జాతీయ గౌరవ పురస్కారం



అవార్డు అందుకుంటున్న బోనగిరి లక్ష్మణ్

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని పొట్లపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న బోనగిరి లక్ష్మణ్ కార్మిక రత్న జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌కు పురస్కారాన్ని అందజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు లక్ష్మణ్ చేస్తున్న కృషిని చూసి తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు జాతీయ అవార్డు అందించడంపై గ్రామ మాజీ సర్పంచ్ సుశీల, వైస్‌ఎంపీపీ దేవసాని నిర్మల, గ్రామ పెద్దలు కానుగుల మోహన్, వార్డుసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన ఒగ్గుడోలు శిక్షణ

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రసాద్

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 15: ఒగ్గుకథ డోలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిద్దిపేట ప్రభత్వ డిగ్రీ కళాశాలలో పది రోజులుగా కొనసాగిన ఒగ్గు డోలు శిక్షణ సోమవారంముగిసింది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కళా ప్రదర్శన అలరించింది. విద్యార్థులు ఒగ్గు డోలు శిక్షణ నేర్చుకోవడం గొప్ప విషయమని రాష్ట్ర ఒగ్గు బీర్ల సంఘం అధ్యక్షుడు ధర్మయ్య అన్నారు. అంతకు ముందు శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వ్యాప్తిని అణచివేస్తాం: సీపీ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన వాల్ పోస్టర్‌ను సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అనురాధ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని, ఇందుకోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకమన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వాప్తిని అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తీవ్రంగా శ్రమిస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే సెల్: 87126 71111, 87126 67100, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

చుంచనకోటలో కనువిప్పు

చేర్యాల, ఏప్రిల్ 15: పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మండలంలోని చుంచనకోటలో ప్రజలను చైతన్యపర్చేందుకు ఆదివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను, ఎస్సై దామోదర్ మాట్లాడుతూ సైబర్ నేరాట పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సీవిజిల్ యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా లేదా విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ పెద్దలపై ఉందన్నారు. కళాబృందం కనువిప్పు కార్యక్రమం ద్వారా మూఢనమ్మకాలు, మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు, జూదం వల్ల కుటుంబంలో జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యామ్‌సుందర్, కనకయ్య, భిక్షపతి, హరిప్రసాద్ పాటలు, నాటకం రూపంలో ప్రజలను చైతన్యపర్చారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

ఆకునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 15: గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వెంటనే కొనుగోలు ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. మండలంలోని ఆకునూరులో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల క్రితం ప్రారంభించిన ధాన్యం సేకరణ కేంద్రాలకు రైతులు పండించిన పంటను తీసుకువచ్చి ఆరబెట్టుకున్నా అధికారులు ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదన్నారు. రైతులకు టార్పాలిన్లు ఇవ్వలేదని, ధాన్యం జల్లించే యంత్రాలు మరమ్మత్తులు చేయించలేదన్నారు. అధికారులు ధాన్యం సేకరణ ప్రారంభించి రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. టార్పాలిన్లతో పాటు తాగునీటి వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వర్గం శ్రీకాంత్, దొండకాయల సంపత్, మాద ఐలయ్య, భూమయ్య, కోడెల యాదగిరి, జక్కు కనకయ్య, భాస్కర్, ఎర్రం కనకయ్య, రాజు, కనకయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

వైద్యపరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యురాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 15: ధూళిమిట్ట మండలం కొండాపూర్‌లో సిద్దిపేట 'ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖాన' ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 50మందికి కంటి పరీక్షలు చేశారు. పదిమందికి ఉచిత ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్యురాలు డాక్టర్ పావని, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, ఫీల్డ్ ఆఫీసర్ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ ఉపసర్పంచ్ బావు కనకయ్య పాల్గొన్నారు.

జలదాన శిబిరం ఏర్పాటు

జలదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జనవికాస ప్రతినిధులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 15: జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరపల్లిలో జలదాన శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జనవికాస ఆధ్వర్యంలో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సహకరించిన కాశబోయిన మురళీ, తిరుపతికి సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థకు చెందిన శ్రీమతి, జ్యోతి, నిర్మల, రేణుక, అనిత, రజిత, మల్లవ్వ, లత పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం

కొమురవెల్లి, ఏప్రిల్ 15: ప్రజాసమస్యలపై పోరాటమే సీపీఎం లక్ష్యమని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాముని గోపాల స్వామి అన్నారు. సోమవారం మండలంలోని మర్రిముచ్చాలలో బోడిగం సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని గెలిపించేందుకు మోదీ ఈడీని నమ్ముకుంటుండాని, కాంగ్రెస్ అవినీతి పార్టీ అని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లను అమ్ముకోద్దని సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, నక్కల యాదవరెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, తులే ఇస్తారి, పాచికంటి బాలరాజు, నక్క పద్మ, సత్తయ్య, బొడిగం చంద్రారెడ్డి, రాంరెడ్డి, సుంచు దేవకుమార్, సునీత, వెంకటేశ్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు

మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, ఏప్రిల్ 15: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని దుకాణాదారులు ట్రేడ్ లైసెన్స్‌ను ఈనెల 30లోగా తీసుకోవాలని లేనివారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ నర్సయ్య తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణాదారుడు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా చూడాలన్నారు.2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ ఇచ్చామని, ఈనెల 30లోగా పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వాసవి కాటన్ మిల్లు వారు 5శాతం రాయితీతో రూ.2,28,616 చెల్లించినట్లు తెలిపారు.

రైతులకు రూ. 500 బోనస్ ఇవ్వాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు యాసంగిలో పండిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని మద్దూరు ఎంపీపీ బద్ధిపడగ కృష్ణారెడ్డి సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని, ఎకరానికి రూ. 15వేల రైతుబంధు ఇస్తామని మోసపూరిత హామీ లు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ప్రతిభ చాటిన కవులు



సన్మానం పొందిన చేర్యాల కవులు

చేర్యాల, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి హైదరాబాద్‌లో పద్య సారస్వత పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శత పద్య కవి సమ్మేళనంలో చేర్యాల కవులు తమ ప్రతిభ చాటి సన్మానం పొందారు. శత పద్య కవి సమ్మేళనంలో శ్రీ క్రోధినామ ఉగాది, శ్రీరామ నవమి పర్వదినములపై పద్య కవితా పఠనంలో చేర్యాల కవులు మంగళగిరి రామచంద్రమూర్తి, గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, ఉప్పల ప్రభాకర్, మల్లావజ్జల చంద్రశేఖర శర్మ ప్రతిభ చాటి నిర్వాహకుల చేతుల మీదుగా సన్మానం పొందారు. ప్రతిభ చాటిన కవులను చేర్యాల రచయితల సంఘం ప్రతినిధులు ఎలికట్టె అయిలయ్య, రామాంజనేయులు, ఉపేందర్‌రావు, అంబటి అంజయ్య, ఉమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి అభినందించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మిరుదొడ్డి, ఏప్రిల్ 15: వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులు వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఉపాధి హామీ పనులు, ఇటుక బట్టీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు డీఎంహెచ్‌వోను డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌వో లింగమూర్తి, వైద్య సిబ్బంది సన్మానించారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వినోద్, బాబ్జి, శ్రీనివాస్, వైద్య సిబ్బంది రాజేశ్వర్, నసీమా, భాస్కర్, రవీందర్, రాజశేఖర్, స్వప్న ఉన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 15 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి వచ్చే రోగుల గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డాక్టర్ రవీందర్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

విరాళాన్ని అందజేస్తున్న వంగ రాజేశ్వర్‌రెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 15: మండలంలోని జేపీ తండాలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గా వీరాంజనేయస్వామి ఆలయానికి రంగధాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగా రాజేశ్వర్‌రెడ్డి రూ.50 వేల విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన దాత వంగ రాజేశ్వర్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేపీతండా మాజీ సర్పంచ్ భూక్యా భిక్షపతినాయక్, సభ్యులు లక్ష్మణ్, వీరానాయక్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాలు అందజేత

గజ్వేల్, ఏప్రిల్ 15: గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు కొద్ది రోజులుగా రామభక్తులచే గోటితో వలిచి తలంబ్రాలను తయారు చేయించారు. ఈనెల 17న జరుగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి 150కిలోల గోటి తలంబ్రాలను ఆలయ ఈవో రామాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ వడ్లను తలంబ్రాలుగా తయారు చేసి ఆలయ ఉద్యోగులకు అప్పగించినట్లు తెలిపారు.

రైతు కుటుంబానికి బీమా అందజేస్తాం

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఏప్రిల్ 15: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన మోటి మల్లయ్య అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 15వ తేదీన 'మరో ఇద్దరు రైతులు ఆత్మహత్య' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితంకాగా సోమవారం జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ స్పందించారు. రైతు మోటి మల్లయ్య పేరు మీద రెండు ఎకరాల రెండు గుంటల భూమి ఉంది. అతను రైతు బీమా దరఖాస్తు చేసుకున్నాడని తెలిపారు. రైతు మోటి మల్లయ్య నామిగా అతడి భార్య కళవ్వ పేరును పొందుపర్చడానికి సంబంధించిన ఫైల్‌ను అతి త్వరలోనే ప్రాసెస్ చేయించి రూ. 5 లక్షల రైతు బీమా అందజేస్తామని ఆయన వివరణ ఇచ్చారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ చైతన్య ర్యాలీ

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 15: రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 16న రాజ్యాంగ పరిరక్షణ చైతన్య యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జేపీసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

కవి సాయంత్రం కమిటీ ప్రధాన కార్యదర్శిగా గౌతమి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 15: కవి సాయంత్రం అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ కవియిత్రి డాక్టర్ జలగడుగుల గౌతమిని నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుభాష వికాసంతో పాటు సాహిత్యాన్ని మరింత విస్తరించేందుకు జనజాగృతి కళాసమితిలో అంతర్భాగంగా కవిసాయంత్రం పేరుతో జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కవి సాయంత్రం నియామకం రెండేండ్ల పాటు కొసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

కల్యాణం కరపత్రం విడుదల

మిరుదొడ్డి, ఏప్రిల్ 15: శ్రీరామనవమి పండుగను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మిరుదొడ్డి టౌన్ రామాలయ కమిటీ చైర్మన్ కుంట నారాయణ అన్నారు. సోమవారం సీతారాముల కల్య